రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



# జిల్లాకు సాగు, తాగు నీరు తెచ్చే బాధ్యత నాది

## స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ భరోసా



మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

**మోమిన్‌పేట్, ఆగస్టు 4. ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా తనవంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో జరిగిన మండల స్థాయి సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. మండలస్థాయి సమావేశాలకు అన్ని శాఖల అధికారులు సరైన పూర్తి సమా చారం అందించాలని, శాఖలవారిగా సమస్యలు, అవసరమైన పనుల వివరాలను అందిస్తే సాధ్యమైనంత తొందరగా పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు ఎల్ల పుడూ అందుబాటులో ఉండి, ప్రజలు ఫోన్ చేస్తే తప్పనిసరిగా స్పందించాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ భాధ్యతగా వ్యవహరించి వాటిని పరిష్కరించాలన్నారు.

వికారాబాద్ జిల్లాకు తాగు, సాగు నీరు అందిం చడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రాణహిత చేవెళ్ళ, పాలమూరు పథకాల ద్వారా ప్రయత్నాలు చేశానని, అయితే గత ప్రభుత్వం పదేండ్ల ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కాగా ప్రస్తుతం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నీళ్ళు దగ్గరి ప్రాంతంవరకు వస్తుండటంతో వికారాబాద్‌కు కూడా ఇవ్వటానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని అన్నారు. జిల్లాకు తాగు, సాగు నీరు తెచ్చే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. జిల్లా పాలనాధికారి దీపక్ తివారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. మండల, గ్రామ పంచాయతీ స్థాయి సమావేశాలు నిర్వహించి ప్రజల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ప్రతి గ్రామ, మండల స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తేనే గ్రౌండ్ లెవల్లో సమస్యలు తెలుసుకోవచ్చాన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటి చైర్మెన్ మహేందర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ సుధీర్, జిల్లా ఏఎస్పీ, మండల ప్రత్యేక అధికారి సదానందం, తహసీల్దార్ మునీరుద్దిన్, రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యధర్శి కరణం కీర్తి రామకృష్ణ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సురెందర్, ఇంచార్జి ఎంపిడిఓ రాజమల్లయ్య, ఎంపిఓ, మండల పరిషతన సిబ్బంది, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**అర్హుల ఎంపిక బాధ్యత మీదే**

**మర్పల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త :** అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం నాడు మర్పల్లి మండల సమీక్షా సమావేశం ఎంపీడీవో శాంత అధ్యక్షతన ఎంపీ డీవో కార్యాలయంలో నిర్వహించారు. కాగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు

>>2




ప్రభుత్వ స్థలంలో అధికారులు ఏర్పాటు చేసిన ఆంక్షల బోర్డు

♦ జవహర్‌నగర్‌లో కబ్జా పర్వం!
♦ మోడ్రన్ టాయిలెట్ల కోసం కేటాయించిన 1500 గజాలూ స్వాహా
♦ రౌడీ మూకలతో స్థానికులకు బెదిరింపులు
♦ అడ్డుకున్న అధికారులపై గతంలో పెట్రోల్‌తో దాడికి యత్నం
♦ ప్రభుత్వం స్పందించాలని స్థానికుల ధర్నా

# 30 ఏళ్ల కాలనీ రోడ్డుకు
# రాత్రికి రాత్రే కట్టడి

**జవహర్‌నగర్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భూకబ్జాదారుల అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. సంతోష్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ భూమిలో ఉన్న 20 అడుగుల రోడ్డును కబ్జా చేసేందుకు కొందరు వ్యక్తులు తెగబడ్డారని కాలనీవాసులు ఆరోపించారు. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. సర్వే నంబర్లు 432, 433 లోని ప్రభుత్వ భూమిలో బాలాజీనగర్ ప్రధాన రహదారి నుంచి సంతోష్‌నగర్ కాలనీకి వెళ్లే 20 అడుగుల ప్రధాన రహదారి ఉంది. అయితే, జవహర్‌నగర్‌కు చెందిన ఓ మాజీ కార్పొరేటర్ కుటుంబ సభ్యులు, మరికొందరు అనుచరులతో కలిసి రాత్రికి రాత్రే ఈ రోడ్డును ఆక్రమించేందుకు ప్రయత్నించారు. అడ్డుగా గోడ నిర్మాణం చేపట్టి, రౌడీ మూకలను రంగంలోకి దింపి స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేశారని వాపోయారు. గత 30 ఏళ్లుగా తాము ఇదే రహ దారిని వినియోగిస్తున్నామని, ఇప్పుడు ఉన్నపళంగా దారినే మూసివేస్తే రాకపోకలు ఎలా సాగించాలని ఆవేదన వ్యక్తం చేశారు.

**రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్నీ కబ్జా**

అంతేకాకుండా, ఇదే సర్వే నంబర్లు 432, 433లో ప్రభుత్వం మోడ్రన్ టాయిలెట్ల నిర్మాణం కోసం సుమారు 1,500 గజాల స్థలాన్ని కేటాయించింది. ఆ స్థలాన్ని కూడా కబ్జాదారులు ఆక్రమించేశారని స్థానికులు ఆరోపించారు. గతంలో ఈ అక్రమ నిర్మాణాలను తొలగించడానికి వచ్చిన ప్రభుత్వ అధికారులపై సదరు కబ్జాదారులు పెట్రోల్‌తో దాడికి కూడా పాల్పడ్డారంటే వారి తెగబడేతనం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం తక్షణమే స్పందించి అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలని, ప్రభుత్వ భూమిని పరిరక్షించడంతో పాటు 20 అతడుగుల రోడ్డును కబ్జాదారుల నుంచి విడిపించి సంతోష్‌నగర్ కాలనీ వాసులకు న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కీసర సర్కిల్ డిప్యూటీ కమినషర్ రామలింగంను వివరణ కోరగా విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



రోడ్డుకు అడ్డంగా గోడ కట్టి కబ్జా చేస్తున్న దృశ్యం

# అక్కడ ఎనీ టైం.. వైన్ రెడీ



జిల్లేడు చౌదరిగూడలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు
చితికిపోతున్న బడుగుల బతుకులు
బాటిల్‌పై రూ.20 అదనపు బాదుడు
మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు

**జిల్లేడు చౌదరిగూడ, ఆగస్టు 4, ప్రభాతవార్త:** మండలంలో అక్రమ మద్యం ఏరులై పారుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో మద్యం లభ్యతను అరికట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో తూగుతుండటంతో బెల్ట్ షాపుల దందా మూడ పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీల్లో ఎక్కడ చూసినా 24 గంటలూ మద్యం అందుబాటులో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. కిరాణా, టీ కొట్లలోనూ మందు విక్రయాలు గ్రామాల్లో సాధారణ కిరాణా షాపులు, టీ స్టాళ్లు కూడా బెల్ట్ షాపులుగా మారిపోయాయి. వ్యాపారులు కిరాణా సామాన్లు, టీ విక్రయాల కంటే మద్యం అమ్మకాల ద్వారానే ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వైన్స్ నిర్వాహకులు నేరుగా గ్రామాలక లీటర్ల కొద్దీ మద్యాన్ని సరఫరా చేస్తూ అక్రమ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్నారు. వైన్స్ ధర కంటే ప్రతి సీసాపై రూ. 10 నుండి రూ. 20 వరకు అదనంగా వసూలు చేస్తూ సామాన్యుల జేబులకు చిల్లులు పొడుస్తున్నారు.

కష్టపడి సంపాదించిన కూలీ డబ్బులను సాయంత్రమయ్యేసరికి బెల్ట్ షాపుల్లోనే తగలేస్తూ దినసరి కూలీలు, యువత మద్యానికి బానిసలవుతున్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం యు వతను మాదకద్రవ్యాలు, మద్యానికి దూరం చేసేందుకు కఠిన చట్టాలు తెస్తున్నామని చెప్తున్నా, క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఆశయాలు నీరుగారిపోతున్నాయి. మద్యానికి బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకుం టున్నారని, వారిపై ఆధారపడ్డ కుటుం బాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైన్స్ నిర్వాహకుల నుంచి ఎక్సైజ్ శాఖ అధికారులకు క్రమం తప్పకుండా మామూళ్లు అందుతుండటంతోనే బెల్ట్ షాపు లపై ఎలాంటి తనిఖీలు నిర్వహించడం లేదని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఏదైనా ఫిర్యాదు వస్తే తుతూమంత్రంగా దాడులు చేసి చేతులు దులుపుకుం టున్నారని మండలానికి చెందిన ప్రజలు, మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పం దించి, గ్రామాల్లో తిష్టవేసిన బెల్ట్ షాపులను శాశ్వతంగా ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని మండల మహిళలు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.




వికారాబాద్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న ఎస్పీ స్నేహామెహ్రా

# హస్తినలో డంపింగ్ యార్డ్ పంచాయతీ

★ కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌తో ఎంపి డీకే అరుణ భేటీ ★ పర్యావరణ, ప్రజారోగ్య అంశాలపై తనిఖీ చేయాలని విజ్ఞప్తి



కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌తో సమావేశమైన ఎంపి అరుణ

**షాద్‌నగర్, ఆగస్టు 4, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డి.కె. అరుణ సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ బాధితులకు అండగా నిలుస్తూ, ఇచ్చిన హామీ మేరకు కేంద్ర ప్రభుత్వ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. ఈ మేరకు కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి సుదీర్ఘంగా చర్చించి వినతిపత్రం అందజేశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో ప్రతిపాదించిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌ను ఇతర ప్రాంతానికి తరలించాలని కేంద్ర మంత్రిని ఎంపీ డీకే అరుణ కోరారు.

ఇటీవల తెలంగాణ ప్రభుత్వం జీవో ఎం ఎస్ నెం.641 (02072026) ద్వారా సిద్దాపూర్ గ్రామంలోని సర్వే నెంబర్లు 252, 278, 361లలోని 86 ఎకరాల భూమిని జీహెచ్‌ఎంసీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు

>>2

## పబ్లిక్ హియరింగ్ నిర్వహించాలి
### క్లైమేట్ ఫ్రంట్ తెలంగాణ డిమాండ్



మాట్లాడుతున్న క్లైమేట్ ఫ్రంట్ నేతలు

**కొత్తూరు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:** ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఏకప క్షంగా నిర్ణయాలు తీసుకోవద్దని క్లైమేట్ ఫ్రంట్ తెలంగాణ డిమాండ్ చేసింది. సిద్దా పూర్ పరిధిలో సుమారు 86 ఎకరాల్లో వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ప్రతిపాదనను ఫ్రంట్ నేతలు వ్యతిరేకిస్తూ గ్రామాలలో పర్యటించి స్థానికులకు మద్దతు తెలిపారు. వేస్ట్‌టుఎనర్జీ ప్లాంట్ల వల్ల పర్యావరణం, ప్రజారోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని క్లైమేట్ ఫ్రంట్ తెలంగాణ స్టీరింగ్ కమిటీ సభ్యులు రుచిత్ ఆశా కమల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పోరాటంలో చివరి వరకు అండగా ఉంటామని నాయకులు స్పష్టం చేశారు. బాధితుల సమస్యలను దేశీయంగానే కాకుండా అవసరమైతే అంతర్జాతీయ వేదికలపై కూడా వినిపిస్తామని వారు పేర్కొన్నారు.

షీ టీమ్స్ సేవలు మరింత విస్తృతం
మహిళా పోలీసులకు ఎస్పీ స్నేహామెహ్రా ఆదేశం
2లో




## షీ టీమ్స్ సేవలు మరింత విస్తృతం

### ఎస్పీ స్నేహామెహ్రా ఆదేశం

**వికారాబాద్, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని జిల్లా మహిళా పోలీస్ స్టేషన్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ స్నేహామెహ్రా ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో సిబ్బంది పనితీరు, స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల ప్రస్తుత స్థితి, దర్యాప్తు పురోగతి, బాధితులకు అందిస్తున్న ఉచిత న్యాయ సహాయం, కౌన్సెలింగ్ ప్రక్రియ, భరోసా కేంద్రంతో అధికారుల సమన్వయంపై ఎస్పీ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలపై జరిగే వేధింపులు, గృహహింస, వరకట్న వేధింపులు వంటి ఫిర్యాదులపై అధికారులు అత్యంత సున్నితంగా, వేగవంతంగా స్పందించాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును చట్టపరంగా, నిష్పక్షపాతంగా విచారించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల విచారణలో ఎలాంటి ఆలస్యం వహించకూడదని, క్షేత్రస్థాయి ఆధారాలను సేకరించడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. బాధితులకు సైకలాజికల్ కౌన్సెలింగ్ అందించడంలోనూ, వారికి పునరావాసం కల్పించడంలోనూ భరోసా కేంద్రాల సేవలను సమర్థవంతంగా వాడుకోవాలని సూచించారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల సరైన నిర్వహణ, డిజిటల్ నమోదు విధానం పకడ్బందీగా చేయాలన్నారు. ప్రజలకు మరింత మెరుగైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించాలని తెలిపారు. మహిళల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంపొందించేలా స్నేహపూర్వక వాతావరణంలో సేవలు అందించాలని, స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితురాలిని గౌరవంగా, సానుభూతితో పలకరించి ధైర్యం చెప్పాలని మార్గదర్శనం చేశారు. రాత్రివేళల్లో, అత్యవసర సమయాల్లో మహిళల రక్షణ కోసం డయల్ 100/112, షీ టీమ్స్ సేవలను మరింత విస్తృతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## అర్హుల ఎంపిక బాధ్యత మీదే

(మొదటి పేజీ తరువాయి)

చేస్తోందని, వాటిని అర్హులకు అందే విధంగా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వలస నివారణ కోసం గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి పథకాన్ని తీసుకువచ్చి కూలీలకు భరోసా కల్పిస్తే కేంద్ర ప్రభుత్వం దాన్ని రద్దుచేయడానికి కుట్రలు చేస్తోందని అన్నారు. ప్రభుత్వాన్ని బదులంచేయాలని కొందరు విద్యుత్ అంతరాయం చేస్తున్నారని సర్పంచ్‌లు రామేశ్వర్, వెంకట్‌రాంరెడ్డి, రఫి, రాజు పలువురు సభాపతి దృష్టికి తేవడంతో 120 మెగావాట్ల సబ్ స్టేషన్‌కు ప్రపోజల్ చేస్తే మంజూరు చేయిస్తామని స్పీకర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇవ్వాలని, ఇండ్ల నిర్మాణంలో వేగవంతం పెంచాలని అన్నారు. గ్రామాలో ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలు కపిస్తూ పారిశుద్ధ్యం పనులకు ప్రాధాన్యత నివ్వాలని అన్నారు. మండలంలోని పలు సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో సుధీర్ ప్రతేక అధికారి బాలకృష్ణ, ఏపిఓ శ్రీనివాస్ పలు శాఖల అధికారులు, సర్పాంచ్‌లు పాల్గొన్నారు.

## హస్తినలో డంపింగ్ యార్డ్ పంచాయతీ

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసిందని ఆమె వివరించారు. ఈ భూమిలో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్‌కు అనుమతులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గతంలో ఇదే భూమిని ఈకో టౌన్ ప్రాజెక్టు కోసం ప్రతిపాదించిన విషయాన్ని కూడా కేంద్ర మంత్రికి గుర్తు చేశారు.

జీవో ఎంఎస్ నెం.111 (1996) ప్రకారం ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలో కాలుష్యానికి కారణమయ్యే పరిశ్రమలు లేదా కార్యకలాపాలు చేపట్టరాదని నిబంధనలు ఉన్నాయని ఆమె వివరించారు. ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ప్రాంతం చుట్టూ దాదాపు 50 గ్రామాలు ఈ జీవో పరిధిలోకి వస్తాయని తెలిపారు. ఈ వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటు చేస్తే భూగర్భ జలాలు కలుషితమై ప్రజల తాగునీరు, ఆరోగ్యం, రైతుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు పెద్దఎత్తున నిరసనలు, ధర్నాలు నిర్వహిస్తున్నారని పేర్కొంటూ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్–2016 మరియు ఈఐఏ నోటిఫికేషన్–2006 నిబంధనల ప్రకారం ఈ ప్రాజెక్టును పునఃసమీక్షి ంచాలని కేంద్రాన్ని కోరారు. స్థానిక ప్రజల అభిప్రాయాలు, అభ్యంతరాలను నేరుగా తెలుసుకునేందుకు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీ కమిటీని ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని కూడా కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌ను ఎంపీ డీకే అరుణ అభ్యర్థించారు. స్థానిక రైతులు, గ్రామస్థుల ఇబ్బందులు, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ అంశంలో తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీ డీకే అరుణ విజ్ఞప్తి చేశారు.

### మాజీ మంత్రి హరీష్ రావుపై ఓయూ పోలీసులకు ఫిర్యాదు

**తార్నాక, అగస్టు 4 ప్రభాతవార్త :** మాజీ మంత్రి హరీష్ రావు తెలంగాణకు హాని కలిగేలా క్షుద్ర పూజలు నిర్వహించారంటూ టీపీసీసీ అధికార ప్రతినిధి దయాకర్ మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యార్థులతో కలిసి ఫిర్యాదు చేసిన ఆయన, ఘటనపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇన్స్పెక్టర్ మహేష్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై హరీష్ రావు తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### సిబిఎస్ఈ క్లస్టర్ బ్యాడ్మింటన్‌లో కృషికారెడ్డికి స్వర్ణపతకం

**నాంపల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త :** సీబీఎస్ఈ క్లస్టర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో మౌంట్ లిటెరాజీ స్కూల్ తరఫున పోటీపడిన ఆదికా కృషికారెడ్డి అండర్–14 బాలికల జట్టు విభాగంలో స్వర్ణపతకం సాధించింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్‌లో సెప్టెంబరు 29 నుండి జరగనున్న సీబీఎస్ఈ జాతీయ బ్యాట్మిండన్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించింది. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 150కుపైగా పాఠశాలలు పాల్గొన్న ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో మౌంట్ లిఎరా జీ స్కూల్ జట్టు క్వార్టర్ ఫైనల్స్‌లో గాడియం స్కూల్ జట్టును ఓడించి స్వర్ణపతాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపక ఛైర్మన్ హెడ్‌కోచ్ వేణు ముప్పాల మాట్లాడుతూ ఆదికా కృషికారెడ్డి గత మూడు సంవత్సరాలు నిరంతర కృషి, క్రమశిక్షణతో రోజుకు 8గంటల సాధనతో ఉన్నతస్థాయికి చేరుకుందని తెలిపారు. మ్యాచ్ పాయింట్ కేవలం బ్యాడ్మింటన్ అకాడమీ మాత్రమే కాదని సక్సెస్‌కి ప్రతిరూపమన్నారు. త్వరలో జరగబోయే సీబీఎస్ఈ జాతీయ స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించి స్వర్ణాన్ని అందుకుని ఇటు రాష్ట్రానికి అటు అకాడమీకి మరింత ఖ్యాతి తీసుకురావాలని ఆకాంక్షించారు.

## అక్రమ కేసులు బనాయించడం సరైంది కాదు

**కంటోన్మెంట్, ఆగస్టు 4 ప్రభాతవార్త:**

తిరుమలగిరి మండల పరిధిలోని బోయిన్‌పల్లి మార్కెట్ సమీపం లోని సర్వే నెం 157బై 1,లో ఉన్న రూ.800 కోట్లు విలువ చేసే 8 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని తహశీల్ కార్యాలయం ముందు నిరసన తెలిపినందుకు 8 మంది బిఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బణాయించడం సరైంది కాదని బిఆర్ఎస్ కార్పోరేషన్ మాజీ చైర్మన్‌లు మన్నెక్రిషాంక్, గజ్జెల నాగేశ్‌లు తెలిపారు. కార్ఖాన పోలీస్ స్టేషన్‌లో 8 మందిపై కేసు నమోదు చేసినందుకు మంగళవారం కార్ఖాన పోలీస్ స్టేషన్‌కు వారు హాజరైయ్యారు. వీరిలో కంటోన్మెంట్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే నివేదిత సాయన్న తదితరులు పాల్గొన్నారు.

# మా ఆస్తులకు రక్షణ ఏది?

### కష్టార్జితంతో చట్టబద్ధంగా ప్లాట్లు కొన్నాం

### 16 ఏళ్ల తర్వాత గుడి స్థలమంటూ కబ్జాకు ప్రయత్నిస్తున్నారు

### ప్లాట్ల యజమానుల ఆందోళన



**షాద్‌నగర్, ఆగస్టు 4, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పరిధిలో పద్నాలుగు ఎనిమిదేళ్ల క్రితం హెచ్ఎండిఎ అనుమతులతో వెలిసిన ఓ రియల్ ఎస్టేట్ వెంచర్ ఇప్పుడు రాజకీయ, స్థానిక వివాదాలకు కేంద్రబిందువుగా మారింది. అన్ని చట్టబద్ధ అనుమతులతో కొనుగోలు చేసిన తమ ప్లాట్లను, ఇప్పుడు ఉన్నట్టుండి దేవాలయ స్థలం పేరుతో లాక్కోవడానికి యత్నిస్తున్నారని బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాలలోకి వెళితే.. ఫరూఖ్‌నగర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 364/ఈ (1 ఎకరం 37 గుంటలు), 365 (1 గుంట)లలో మొత్తం ఎకరం 38 గుంటల భూమిని 2010లో సంగాపురం బీరయ్య, లింగమయ్యల నుంచి సీఎస్కే రియల్టర్స్ లిమిటెడ్ సంస్థ డాక్యుమెంట్ నంబర్ 5456/2010 ద్వారా కొనుగోలు చేసింది. ఆ తర్వాత నాలా కన్వర్షన్ పూర్తి చేసి, హెచ్ఎండిఎ అనుమతులతో ప్లాట్లుగా మార్చి విక్రయించింది. అందులో పలువురు బాధితులు కోట్లు వెచ్చించి ప్లాట్లను (ప్లాట్ నంబర్లు: 432, 433, 434, 436, 437) చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

**బీరప్ప దేవాలయం పేరిట హడావుడితో కలకలం**

గత 16 ఏళ్లుగా ఎలాంటి ఆటంకాలు లేని ఈ స్థలంలో, సుమారు 9 నెలల క్రితం స్థానికులు కొందరు బీరప్ప దేవాలయ నిర్మాణానికంటూ ప్రయత్నాలు ప్రారంభించడంతో వివాదం మొదలైంది. పోలీసులు జోక్యం చేసుకుని సమస్య తేలే వరకు ఎవరూ ఆ స్థలంలోకి వెళ్లకూడదని ఇరువర్గాలకు ఒప్పందం కుదిర్చారు. అయితే ఇటీవల మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్, బీజేపీ నాయకుడు అందే బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు ఆ స్థలాన్ని సందర్శించి, దాన్ని గుడికే కేటాయించాలని డిమాండ్ చేయడంతో ఉద్రిక్తత మరింత తీవ్రమైంది.

**భక్తులను రెచ్చగొట్టి ఆక్రమించేందుకు కుట్ర: ప్లాట్ల యజమానుల ఆందోళన**

హెచ్ఎండిఎ అనుమతులు చూసి, కష్టపడి సంపాదించిన డబ్బుతో చట్టబద్ధంగా ప్లాట్లు కొనుగోలు చేశామని, 16 ఏళ్ల పాటు ఏ గొడవ లేని స్థలంలో ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం భక్తులను రెచ్చగొడుతూ తమ స్థలాలను ఆక్రమించే కుట్ర చేస్తున్నారని ప్లాట్ యజ మానులు ఆరోపిస్తున్నారు. తమ వద్ద అన్నీ లీగల్ డాక్యు మెంట్లు ఉన్నాయని, అక్రమంగా ఎవరైనా తమ స్థలాల్లోకి వస్తే చట్టపరంగా కోర్టులను ఆశ్రయిస్తామని వారు హెచ్చరించారు. అన్ని అనుమతులు ఇచ్చి విక్రయాలు జరి పిన 16 ఏళ్ల తర్వాత ఇలాంటి వివాదాలు రావడంపై రియల్ ఎస్టేట్ వర్గాల్లోనూ ఆందోళన వ్యక్తమవుతోంది.

**ఆలయ స్థల వివాదంపై రాజకీయాలొద్దు : ఎమ్మెల్యే**

అందరికి ఆమోదయోగ్యంగా ఉండేవిధంగా బీరప్ప ఆలయాన్ని నిర్మించుకునేందుకు స్థల ఏర్పాటు జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భరోసా ఇచ్చారు. ఫరూక్‌నగర్ ప్రాంతానికి చెందిన పలువురు కురువ కులస్తులు, ఇతర గ్రామ ప్రజలు మంగళవారం ఎమ్మెల్యేను కలుసుకున్నారు. సీఎస్కే వెంచర్‌లో పురాతన బీరప్ప దేవాలయం స్థల వివాదాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. సీఎస్కే యాజమాన్యం భూమి తీసుకున్న సమయంలో దానికి బదులుగా దేవాలయానికి భూమి ఇచ్చేందుకు ఒప్పుకున్నారని ఆ తర్వాత బీరప్ప దేవాలయం ఉన్న స్థలాన్ని ప్లాట్లుగా మార్చి గతంలోని విక్రయించారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.

కేవలం ఒక గుంట పొలం మాత్రమే అక్కడ ఉందని మిగతా స్థలం లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు. ప్రస్తుతం అక్కడ కొన్ని నిర్మాణాలను తొలగించడంతో వివాదం మొదలైందని తెలిపారు.

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ.. ఆలయాలు ఆత్మగౌరవాలని వాటికి ఎవరూ భంగం కలిగించవద్దని తెలిపారు. పూర్తిస్థాయిలో వాస్తవ విషయాలపై అధ్యయనం చేసి న్యాయం జరిగేలా చూసానతనని భరోసా ఇచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు శాశ్వత విలువలు సృష్టించే సంస్థలను నిర్మించాలి

### - మామఎర్త్ వ్యవస్థాపకురాలు ఘజల్ అలఘ్

**జూబ్లీహిల్స్, ఆగస్టు 4, ప్రభాతవార్తః**

మహిళా పారిశ్రామికవేత్తలు నిలకడగా ఎదిగి, విస్తరించి, శాశ్వత విలువను సృష్టించే సంస్థలను నిర్మించాలని మామాఎర్త్ వ్యవస్థాపకురాలు ఘజల్ అలఘ్ పిలుపునిచ్చారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్(ఎఫ్ఎల్ఓ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లో నిర్వహించిన ఫ్రమ్ ఐడియా టు ఐపీఓ – బిల్డింగ్ బియాండ్ బౌండరీస్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తొలిసారి తల్లి అయిన అనుభవమే మామాఎర్త్ స్థాపనకు ప్రేరణగా నిలిచిందని, ఒక చేతిలో బిడ్డను ఎత్తుకుని మరో చేతిలో ఫోన్‌తో కస్టమర్లతో మాట్లాడిన రోజులు ఇప్పటికీ గుర్తున్నాయన్నారు. ఎఫ్ఎంసీజీ రంగంలో ఎలాంటి అనుభవం లేకపోయినా సున్నా నుంచి సంస్థను నిర్మించి దేశంలోని ప్రముఖ బ్యూటీ, పర్సనల్ కేర్ కంపెనీల్లో ఒకటిగా తీర్చిదిద్దామన్నారు. మంచి ఉత్పత్తి కంటే వినియోగదారుల సమస్యను గుర్తించి పరిష్కారం చూపడమే విజయానికి కీలకమన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలు గతంతో పోలిస్తే ఇప్పుడు మెరుగైన అవకాశాలు పొందుతున్నారని, అందరి సల హాలు విన్నప్పటికీ చివరకు తమ అంతరాత్మను నమ్మి ముందుకు సాగాలని సూచించారు. ఎఫ్ఎల్ఓ హైదరాబాద్ చైర్‌పర్సన్ సీతా రెడ్డి మాట్లాడుతూ, పారిశ్రామికవేత్తగా ఎదగడం ధైర్యం, వినూత్న ఆలోచన, నిరంతర అభ్యాసంతో కూడిన ప్రయాణమన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన హ్యాండ్‌లూమ్ పావిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. అలాగే ఎఫ్ఎల్ఓ హైదరాబాద్‌కు శిల్పారామం సమీపంలో కార్యాలయం కోసం 1,000 చదరపు గజాల స్థలం, భారత్ ఫ్యూచర్ పార్క్‌లో ఒక ఎకరం భూమి కేటాయించడం సంస్థ అభివృద్ధిలో కీలక ఘట్టమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎఫ్ఎల్ఓ తరుపున ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఘజల్ ఆలఘ్, సీతారెడ్డి తదితరులు.

## పాత్రికేయులు ప్రజోపయోగకరమైన వార్తలు రాయాలి : ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

**నార్సింగి, ఆగస్టు 4 ప్రభాతవార్త :** పాత్రికేయులు ప్రజోపయోగకరమైన వార్తలు రాయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం గండిపేట మండల టియుడబ్ల్యుజె నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే నూతన కమిటీ సభ్యులను అభినందించి, ఐక్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కత్తికన్నా కలం గొప్పదని, పాత్రికేయుల కథనాలుప్రజల ఇబ్బందులు కనిపించేలా ఉండాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులు, అధికారుల దృష్టికి తీసుకు వచ్చి పరిష్కారం అయ్యేలా వాస్తవ కథనాలు రాయాలని సూచించారు. జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చే అన్ని రకాల సంక్షేమ పతకాలు అందేలా నావంతు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ఇళ్లస్థలాలు, ఇన్సూరెన్స్, హెల్త్‌కార్డులు అందేలా చూస్తానని పేర్కొన్నారు. అనంతరం గండిపేట మండల టియుడబ్ల్యుజె నూతన కమిటీ అధ్యక్షులు రాము యాదవ్‌ను సన్మానించారు.


రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసిన గండిపేట మండల జర్నలిస్టు యూనియన్ నూతన కార్యవర్గం సభ్యులు.

ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు సత్యంగౌడ్, గోపాల్, ప్రవీణ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి నర్సింలు, సంయుకనత కారదర్శిలు ప్రభాకర్, శివకుమార్, కార్య నిర్వాహక కార్యదర్శిలు విజయ్ కుమార్, రామకృష్ణ, సభ్యులు శ్యామ్‌కుమార్, విజయ్ ప్రతాప్‌లు ఉన్నారు.

## పెండింగ్ సమస్యలపై శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నజర్

**శేరిలింగంపల్లి, అగస్టు 4 ప్రభాతవార్త**

శేరిలింగంపల్లి జోనల్ పరిధిలోని ఆయా సర్కిళ్లల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై దృష్టిసారించి వాటిని పరిష్కరించేందుకు అధికారయంత్రాంగం వేగవంతంగా పనిచేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఆదేశించారు. శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతో జోనల్ కమిషనర్ నారాయన్ అమిత్ సమావేశమయ్యారు. జోనల్ పరిధిలోని పలు అభివృద్ధి పనులు, పెండింగ్ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశానికి ఆయా సర్కిళ్ల డిప్యూటి కమిషనర్లు, సూపరిండెంట్ ఇంజనీర్లు, సిటీ ప్లానర్లు, అర్బన్ బయోడైవర్సిటీ అధికారులు, ఫైనాన్స్ అడ్వైజర్లు, ఎగ్జామనర్ ఆఫ్ అకౌంట్స్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ సిటీ ప్లానర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్లు హజరయ్యారు. ముఖ్యంగా జోన్ లోని ఆయా సర్కిళ్లలో నెలకున్న సమస్యలు ,శేరిలింగంపల్లి సర్కిల్‌లో ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయా విభాగాలల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన క్లియర్ చేసి సర్క్యూలేట్ చేయాలని జోనల్ కమిషనర్ ఆదేశించారు. జోన్ పరిధిలోని అభివృద్ధి పనులకు సంబందించిన బడ్జెట్ కెటాయింపులపై సమీక్షించారు. సిబ్బంది జీతాలను క్లియ రెన్స్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించా రు.


జోనల్ కార్యాలయంలో ఆయా విభాగాల అధికారులతో సమావేశమైన జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్

అర్బన్ బయోడైవర్సిటీలో భాగంగా జోన్ పరిధిలో హరితాహారం, పార్కుల నిర్వాహణ, మొక్కల పెంపకం పనుల పురోగతిని పరిశీలించారు. రోడ్లు, డ్రైనేజీ ఇతర మౌలిక వసతుల అంశాలపై ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో ఆయా పనుల స్థితిగతులపై చర్చించారు. అదే విధంగా భవన నిర్మాణ అనుమతులకు సంబందించిన బిల్డ్‌నౌ పెండింగ్ ధరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జోనల్ కమిషనర్ సిటీ ప్లానింగ్ అధికారులకు సూచించారు. ఫాగింగ్, రక్షణ చర్యల్లో భాగంగా దోమల నివారణ, సీజనల్ వ్యాదుల అదుపు కోసం జోన్ పరిధిలో ఫాగింగ్ యాక్టివిటీస్‌ను మరింత ముమ్మరం చే యాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సమన్వయంతో పనిచేసి నిర్ధేశిత గడువులోగా పనులన్నింటినీ పూర్తిచేయాలని జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ అధికారులకు ఆదేశించారు.

## పేద ప్రజలకు సేవలు అందించటానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి


డాక్టర్ నాగనాథ్ మాశెట్టి జగదేవి దంపతులకు పురస్కారాన్ని ప్రధానం చేస్తున్న దృశ్యం

**మైలార్‌దేవ్‌పల్లి ఆగస్టు 4 ప్రభాతవార్త :** ప్రముఖ సంఘ సేవకులు, వ్యాపారవేత్త తెలంగాణ బసవ కేంద్రం అధ్యక్షులు డాక్టర్. నాగనాథ్ మాశెట్టి జగదేవి దంపతులకు ఆదర్శ దంపతుల అవార్డు లభించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా లలిత కళా సమాఖ్య సేవా సామాజిక సాంస్కృతిక ఆధ్వర్యంలో జరిగిన సువర్ణ ఘంటా కంకణ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో స్వయంబు సాలగ్రామ శ్వేతారణ్య గణపతి సహిత శ్రీ చాముండేశ్వరీ అనుగ్రహ పీఠాధిపతులు విశ్వధర్మ సేవా రత్న బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ కృష్ణ చాముండేశ్వరీ మహర్షి చేతుల మీదుగా స్వర్ణ కంకణం, గోల్డ్‌మెడల్, ప్రశంసా పత్రంతో పాటు మెమెంటోను నాగనాథ్ మాశెట్టి, జగదేవి దంపతులు అందుకున్నారు. ఈ సందర్భంగా నాగనాథ్ మాశెట్టి మాట్లాడుతూ పేద ప్రజలకు సేవలు అందించటానికి ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని తెలిపారు.

### ఎల్లమ్మ-మారెమ్మ ఆలయంలో బోనాల వేడుకలు



**జూబ్లీహిల్స్, అగస్టు 4, ప్రభాతవార్తః** ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని దుర్గాభవాని నగర్ ఎల్లమ్మ–మారెమ్మ ఆలయంలో బోనాల మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలంతా ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మామిడి నర్సింగ్ రావు, ఆకుల రాజు, బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు ఎల్లయ్య, భీములు, ఆంధ్ర శ్రీను, మహేష్, శెట్టి తదితరులతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించారు.

### తెలుగు భాషా వికాసానికి మండలి సేవలు చిరస్మరణీయం : కె వి .రమణాచారి


మండలి వెంకట కృష్ణారావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కెవి రమణాచారి, కృష్ణ జిల్లా పూర్వ కలెక్టర్ లక్ష్మీ ౖకాంతం తదితరులు

**చిక్కడపల్లి ఆగస్టు 4 ( ప్రభాతవార్త ) :** ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల సూత్రధారి, దివంగత శ్రీ మండలి వెంకట కృష్ణారావు సేవలు చిరస్మరణీయమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కెవి రమణాచారి అన్నారు. మంగళవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగాన సభ (కళా సుబ్బారావు కళావేదిక)లో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో మండలి వెంకట కృష్ణారావు శతజయంతి మహోత్సవాల ముగింపు సభ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రమణాచారి ముఖ్య ప్రసంగం చేస్తూ తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతుల పరిరక్షణకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఒకే వేదికపైకి తీసుకురావడానికి మండలి వెంకట కృష్ణారావు గారు చేసిన కృషి అనన్యసామాన్యం. ప్రపంచ తెలుగు మహాసభల ద్వారా తెలుగు భాషా వికాసానికి ఆయన వేసిన పునాదులు నేటికీ ఆదర్శనీయం. సమాజ సేవలోనూ, రాజకీయ రంగంలోనూ ఆయన పాటించిన విలువలు అందరికీ మార్గదర్శకం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా పూర్వ కలెక్టర్ బి. లక్ష్మీ ౖకాంతం విశిష్ట అతిథిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ పూర్వ అధ్యక్షులు ఎల్.వి.యస్.ఆర్.కే. ప్రసాద్ , నిర్వ హణా సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురాం, సు బ్బారావు తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ గాయకుడూ వి.ఆర్.కే. ఫణి సమర్పణలో "పాడనా తెలుగు పాట" సంగీత విభావరి ప్రేక్షకులను


సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారిని ఏ జీ సుదర్శన్ రెడ్డి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఈ ఓ ఆలయ సాంప్రదాయాల ప్రకారం స్వాగతం పలికి సత్కరించారు.పూజలు నిర్వహింపజేసారు.పూజల అనంతరం ప్రసాదాన్ని అందజేసారు.ఆయనకు ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి స్వాగతం పలికి ప్రసాదాన్ని అందజేసారు

### బోనాల పండుగ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం


బోనాల సమావేశంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ జి.శంకర్ యాదవ్, బిఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌గౌడ్‌లు

**గోషామహల్, ఆగస్టు 4ప్రభాతవార్త:** బోనాల పండుగ నేపథ్యంలో గౌలిగూడ మహంకాళి ఆలయకమిటి చైర్మన్ మాజీ కార్పొరేటర్ గొంటిశంకర్‌యాదవ్, వైస్ చైర్మన్, బిఆర్ఎస్ నాయకులు మునుకుంట్ల ఆనంద్‌కుమార్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆలయంలో బుధవారంతో బోనాల పండుగ ఉత్సవాలు ప్రారంభమవుతాయని, గురు, శుక్ర వారాల్లో ఇంటింటికి ఘట్టం, ఊరేగింపు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆదివారంబోనాల ఉత్సవాలు, సోమవారం గావు, రంగం కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరుగుతుందనివారు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఈసమావేశంలో మాజీ కార్పొరేటర్లు రాకేష్‌జైస్వాల్, డాక్టర్ సురేఖ ఓంప్రకాష్, ఆలయ కమిటి ప్రతినిధులు బి.బాలకిషన్, దేవేందర్, రమేష్, గోవింద్ ప్రసాద్, మహేష్ గౌడ్, రవి యాదవ్, చింటూ, సునీల్, సంతోష్‌చారి, బాలిరాజు, పోలోజు వేణు, వినోద్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### 15 నుంచి 'ఇస్కాన్ దేవాలయ స్వర్ణోత్సవ వేడుకలు'

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:**

అబిడ్స్ లోని ఇస్కాన్ దేవాలయం నిర్మించి యాభై ఏళ్లు నిండిన సందర్భంగా ఈనెల 15వ తేదినుంచి 18వ తేదివరకు స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సభ్యులు సాదశిరోణిదాస్ తెలిపారు. 1976లో అబిడ్స్‌లోని శీల ప్రభుపాద ఈ ఆలయాన్ని నిర్మించారని, ప్రపంచంలో వెయ్యికి పైగా ఇస్కాన్ ఆలయాలు నిర్మించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ స్వర్ణోత్సవ వేడుకలు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం స్వర్ణోత్సవ వేడుకల ఆహ్వాన ప త్రాన్ని కాచిగూడ మున్నూరు కాపు మెడికల్ సెంటర్లో హ్యూమనిటి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ కొండా శ్రీనివాస్రావు డాక్టర్ మోహన్‌రాజ్ శ్రీవాత్స సవాలకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో ఈ స్వర్ణోత్సవాలు ప్రారంభమై ఈనెల 18ను ముగుస్తాయని ఆయన వెల్లడిం చారు. ఈసందర్భంగా భగవద్గీత ప్రవచణాలు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

### 269 దేవాలయాలకు చెక్కులు పంపిణీ

**చార్మినార్, ఆగస్టు 4 ప్రభాతవార్త :**

ఆషాడ మాస బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా మంగళవారం హరిబౌలిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ–ధర్మాదాయ శాఖ పాతబస్తీలోని 269 దేవాలయాలకు 3 కోట్ల,7 లక్షల 37 వేల రూపాయల ఆర్థిక సహకార చెక్కులను పంపిణీ చేశారు. దేవాదాయ–ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ క్రిష్ణ ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి చైర్మన్ మల్యాల మధుసూదన్ యాదవ్ దేవాలయాల కమిటిల ప్రతినిధులకు చెక్కులు అందజేశారు.

### విద్యుత్ ఉద్యోగుల సమస్యలు మేనేజ్మెంట్ దృష్టికి తీసుకెళ్తాం : డిఈ రత్నాకర్ రావు

**అత్తాపూర్ ఆగస్టు4, ప్రభాతవార్త :**

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను మేనేజ్మెంట్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ డి ఈ పి రత్నాకర్ రావు తెలిపారు. మంగళవారం రాజేంద్రనగర్ డివిజన్‌లో శంషాబాద్ సబ్ డివిజన్‌లో చిన్న గోల్కొండ ప్రాంతంలో విద్యుత్ షాక్ తో మృతి చెందిన ఆర్టిజన్ అనిల్ కుమార్ కుటుంబానికి ఎలక్ట్రికల్ షార్ట్ తోటి చనిపోవడం జరిగింది . అనిల్ కుమార్ భార్యకు ఏం రజితకు కారుణ్య ఉద్యోగం తో పాటు డిపార్ట్మెంట్లో ఎక్స్ గ్రేషియా 34 లక్షలు అలాగే ఎస్బిఐ కోటి రూపాయల ఇన్సూరెన్స్ ఇప్పించడం జరిగింది ఇందులో ముఖ్య భూమిక పోషించిన రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ డి ఈ పి రత్నాకర్ రావు కి హెచ్ 82 నాయకులు కిరణ్ , రాజుకి మిగతా నాయకులకు ఏం రజిత ధన్యవాదాలు తెలపడం జరిగింది అలాగే ఈ సందర్భంగా ఆటిజన్ పలు సమస్యలు పై డి ఈ పి రత్నాకర్ రావు తో మాట్లాడడం జరిగింది డి ఈ పి రత్నాకర్ రావు మాట్లాడుతూ.. సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఇందులో పాల్గొన్న హెచ్ 82 సర్కిల్ ప్రెసిడెంట్ కె రాజు డివిజన్ ప్రెసిడెంట్ అనిల్ డివిజన్ సెక్రెటరీ సిద్ధులు మిగతా నాయకులు అందరూ అలాగే ఇతిహాస్ యూనియన్ నాయకులు స్వామి , సాజిద్ , మిగతా ఇతిహాస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### అమ్మవారి ఆలయంలో ఉమామహేశ్వరి పూజలు



**అత్తాపూర్ ఆగస్టు4, ప్రభాతవార్త :**

బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అన్ని బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు ఉమామహేశ్వరి పేర్కొన్నారు. మంగళవారంరాంభాగ్ దుర్గామాత ఆలయంలో అమ్మవారికి ఉమామహేశ్వరి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలను ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని పేర్కొన్నారు. అమ్మవారి ఆశిస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పుష్ప , నాగమణి, బాలమని, శమంత భారతి, కవిత, సంధ్య, జయమ్మ, అంజమ్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి : ఇన్‌స్పెక్టర్ సీతయ్య



**అత్తాపూర్ ఆగస్టు4, ప్రభాతవార్త :**

విద్యార్థుల సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఇన్‌స్పెక్టర్ సీతయ్య పేర్కొన్నారు. మంగళవారం అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల్‌మెట్ ఎక్స్ రోడ్‌లో ఉన్న గౌతమ్ మోడల్ స్కూల్లో అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ఎస్ఐ పీ జయరాజ్, సైబర్ వారియర్ సిబ్బంది పాల్గొని విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సైబర్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని ఓటీపీ, ఉద్యోగాల పేరుతో జరిగే, లోన్ యాప్ వేధింపులు, ఏపీకే ఫైల్‌ల ద్వారా జరిగే మోసాలు, పెట్టుబడుల పేరుతో, క్రెడిట్ కార్డు మోసాలను వివరించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు, యాప్‌లను నమ్మవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం లేదా ఓటీపీని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ తెలియజేయవద్దని విద్యార్థులకు సూచించారు. ఏదైనా సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మ వారికి బంగారు బోనం



**చార్మినార్, ఆగస్టు 4 ప్రభాతవార్త :**

ఆషాడ మాస బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా మంగళవారం భాగ్యనగర్ శ్రీ మహంకాళీ జాతర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి ఆధ్వర్యంలో చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి అధ్యక్షులు మధుసూదన్ యాదవ్, పలు దేవాలయాలకమిటీల ప్రతినిధులు గాజుల అంజయ్య, సదానంద్ యాదవ్, రాకేష్ తివారి, రాఘవేందర్. హంసరాజ్ పాల్గొన్నారు.


బోనాల పండుగను కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ల పరిధిలోని వివిధ కాలనీలలో ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి వివిధ కాలనీల దేవాలయాలను సందర్శించి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ల అధ్యక్షులు పార్టీ నేతలు ఉన్నారు.

## పోషకాహార పథకాలను సక్రమంగా అందించాలి

**ఆమనగల్లు, ఆగస్టు4, ప్రభాతవార్త:** ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాలను ప్రతి లబ్ధిదారుడికి సక్రమంగా అందించాలని మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని 7వవార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సిడిపిఒ శాంతిరేఖ అధ్యక్షతన జరిగిన ఐసిడిఎస్ బాలామృతం పంపిణీ కార్య క్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన అంగన్‌వాడీ చిన్నారులకు బాలామృతం తినిపించారు. ఈమేరకు జరిగిన సమావేశంలో పత్యానాయక్ మాట్లాడుతూ 6నెలల నుండి 6సంవత్సరాల వయసు గల చిన్నారులకు, గర్భిణీలు, బాలింతలకు బాలామృతం ప్యాకెట్లను అందజేశారు.పిల్లల ఆరోగ్యమే దేశ భవిష్యత్తని, పోషక విలువల తో కూడిన బాలామృతాన్ని రోజూ తప్పకుండా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యమన్నారు. చిన్నారులకు బాలామృతం అందించిన అనంతరం చైర్మన్ పత్యానాయక్ వారితో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వార్డు కౌన్సిలర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఏజిఎల్1. చిన్నారికి ఆహారం తినిపిస్తున్న చైర్మన్ పత్యానాయక్



విద్యార్థులతో మాట్లాడుతున్న సర్పంచ్

## మెను ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలి

**పెద్దేముల్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** పాఠశాలలో మెనుప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సర్పంచ్ డివై నర్సిములు అన్నారు. పెద్దేముల్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనపథకాన్ని సర్పంచ్ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. వంటశాల పరిశుభ్రత, భోజన నాణ్యత, మెను ప్రకారం భోజనాన్ని అందిస్తున్నారా అనే అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ డివై నర్సిములు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని ప్రతి విద్యార్థి తప్పకుండా తీసుకోవాలని అన్నారు. పరిశుభ్రత పాటిస్తూ క్రమశిక్షణతో చదువుకొని

ఉన్నత లక్ష్యాలను సాధించాలని అన్నారు. విద్యార్థుల విద్యతోపాటు వారి ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెను ప్రకారం నాణ్యమైన ఆహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని సూచించారు. పాఠశాల అభివృద్ధికి గ్రామ పంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కొర్రెములలో పలువురు కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిక

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ పరిధిలోని కొర్రెముల గ్రామం బాలాజీ నగర్,నందన్ హిల్స్ కాలనీ నుండి పదిమంది ముఖ్య కార్యకర్తలు మంగళవారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారికి పార్టీడివిజన్ అధ్యక్షుడు పార్టీ కండువాకప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాజేశ్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను విశ్వసించి ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. వినోద్ కుమార్, కాంగ్రెస్ నాయకులు పల్లె బాబురావు, బి. జంగయ్య, డి. ఆంజనేయులు, రవి, సంతోశ్, మహేశ్ యూత్ కాంగ్రెస్ నాయకుడు వంశీ యాదవ్, నందన్ హిల్స్ కాలనీ అధ్యక్షుడు శామల శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ కార్యాలయం వద్ద వ్యక్తిపై దాడి

**- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు**

**యాచారం , ఆగస్టు 4, ప్రభాతవార్త:** యాచారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓ వ్యక్తిపై దాడి చేసి, కులం పేరుతో దూషించిన ఘటనపై మంగళవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం సోమవారం మధ్యాహ్నం సుమారు 3.30 గంటల సమయంలో యాచారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కొర్ర రాజు ఎంఆర్వో కార్యాలయం వద్ద ఉన్న సమయంలో మిటాబాయి నరేందర్ రెడ్డి, మిటాబాయి శేఖర్ రెడ్డి, మలె అనంతరెడ్డి, మలె నారాయణరెడ్డి మరియు మరో ఇద్దరు వ్యక్తులు కలసి ఆయనపై దాడికి దిగారు. అంతేకాకుండా కులంపేరుతో దూషిస్తూ అవమానించారని బాధితుడు పేర్కొన్నారు. దీనిపై బాధితుడు కొర్ర రాజు అదే రోజు సాయంత్రం 5.30 గంటలకు యాచారం పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు తహసీల్దార్ కార్యాలయంలో స్వయంగా విచారణ చేపట్టారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ అనంతరం నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ విచారణ కార్యక్రమంలో సీఐ నందీశ్వర్ రెడ్డి, ఎస్ఐ మధు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**సర్పంచ్ చంద్రభూపాల్ రావు**

**కుల్కచర్ల,ఆగస్టు 4, ప్రభాతవార్త:** విద్యార్థులకు సనుకులమైప సౌకర్యాలు కల్పిం చి నాణ్యమైన భోజనం అందిం చాలని సర్పంచ్ చంద్రభూపాల్ రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముజాహిద్ పూర్ గ్రామం లోని మోడల్ స్కూల్ బాలికల హస్టల్‌ను స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రభూపాల్ రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్య ,వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిం చాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్ వార్డు సభ్యులు షర్ఫుదిన్,భాస్కర్, పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు రాములు వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.



బాలికల హస్టల్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్

## మిషన్ భగీరథ పైప్ లైన్ నిర్మాణ పనులు షురూ

**నందిగామ, ఆగస్టు 4, ప్రభాతవార్త :** నందిగామ మండలం అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద 11వ వార్డు సభ్యుడు కిట్టుఆధ్వర్యంలో మంగళవారం జెసిబి సహాయంతో మిషన్ భగీరథ పైప్ లైన్ నిర్మాణ పనులను సర్పంచ్ కొమ్ము కృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, నాయకులు ఎర్రగారి రమేష్, నరేందర్ రెడ్డి, నోకియా తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామి దేవాలయ పరిసరాల్లో మిషన్ భగీరథ పైప్ లైన్ నిర్మాణ పనులు ప్రారంభం

# ఎల్‌నినో ప్రభావానికి ప్రత్యామ్నాయం ఏమిటి ?

**యాచారం,ఆగస్టు4,ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీలలో ఎలినినో కారణంగా వరి సాగు తగ్గి ఆరుతడి పంటలను సాగు చేస్తున్నారు. వ్యవసాయ అధికారి రవినాథ్, ఉద్యానవన శాఖ ఇబ్రహీంపట్నం అధికారి నవీన ఆధ్వర్యంలో పలుమార్లు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి వరికి ప్రత్యన్న ఏర్పాట్ల పంటలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఇప్పటికే నాటిన వరి నాట్లని సుమారు 20 ఎండు ముఖం పట్టినట్లు రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం 17,000 ఎకరాల వారి సాగు చేయగా ఈ సంవత్సరం 6700 ఎకరాలు మాత్రమే ఇప్పటికీ వారినట్లు వేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ సంవత్సరం ఎలినీనో ప్రభావానికి గత సంవత్సరంతో పోలిస్తే వరి సాగు 65 శాతానికి పడిపోతుందని అంటున్నారు. ప్రభుత్వం అధికారుల సూచన మేరకు కందులు జొన్నలు పత్తిపై రైతులు ఎక్కువ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది . ప్రతి సంవత్సరం ఏరువుల ధరలు పెరగడం కూలీలు ధరలు పెరగడం పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడంతో డ్రాక్టర్ల ఖర్చు కూడా అధికంగా పెరిగిందనీ దీంతో రైతులు లాభం వచ్చే మాట పక్కన పెడితే అధిక నష్టం వచ్చే పరిస్థితులు ఉన్నాయని ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా పంట నష్టపరిహారం లేదా అధిక సబ్సిడిలపై విత్తనాలు ఎరువులు అందించాలని తక్షణమే రైతు భరోసా మరోసారి పూర్తిస్థాయిలో అందజేయాలని రైతులు కోరుతున్నారు.



నీరు లేక ఎండిపోయిన వరి నాట్లు

# పోచారం పెరుమాల చెరువు అభివృద్ధికి మోక్షం

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 4, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ పరిధిలోని పెరుమాల చెరువు అభివృద్ధి పనులకు త్వరలో మోక్షం కలుగనున్నట్లు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యుగేంధర్ రెడ్డి అన్నారు. పోచారం గ్రామంలోని శివాలయం ప్రక్కన గల పెరుమాల చెరువు అభివృద్ధి కొరకు చెరువుల హద్దుల నిర్ధారణ అభివృద్ధి పనులు కీలకదశకు చేరుకున్నట్లు యూత్ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఇన్ఫోసిస్ సీఎస్ఆర్ నిధుల సహాయంతో చెరువును అన్ని విధాలుగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మంగళవారం పెరుమాల చెరువును యూత్ కాంగ్రెస్ నాయకుడు సందర్శించి పరిశీలించారు. భవిష్యత్తులో ఈ చెరువు మినీ ట్యాంక్‌బండ్ రూపుదిద్దుకుంటుందని అన్నారు. భక్తులు, స్థానిక ప్రజలు, యువత కోసం ఆహ్లాదకరమైన విహార కేంద్రంగా మారనున్నట్లు తెలిపారు. ఈ చెరువు అభివృద్ధికి సహకారం అందిస్తున్న డీసీసీ అధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్, ఇరిగేషన్ డీఈఈ ఆంజనేయులు, ఏఈ మౌనిక, డిప్యూటీ కమిషనర్ వాణి, డీఈఈ నరేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



పోచారంలోని పెరుమాల చెరువును సందర్శించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు యుగేంధర్ రెడ్డి.

# షెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో పేదలకు చేయూత

**కొడంగల్,అగష్టు 4,ప్రభాతవార్త:** నిరుపేదలను ఆర్థికంగా అదుకునేందుకు సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణా పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారాయుడు బొంరాస్‌పేట్,కొడంగల్ మండలాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు.ఈ సందర్భంగా మంగళవారం కొడంగల్ వచ్చిన ఆయన ముందుగా బొంరాస్‌పేట్ మండలంలోని నాగిరెడ్డిపల్లి ,రేగడ మైలారం గ్రామాల్లోని పంచాయతీ భవనాల్లో రైతులతో మాట్లాడారు.అనంతరం కొడంగల్‌లోని పశువుల ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పర్సా పూర్‌తో పాటు ఇతర గ్రామాలకు చెందిన రైతులకు పలుసూచనలు,సలహాల అందించారు.ఇందులో ప్రత్యేకంగా షెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలు, ఆవులు,గేదెలు ఇతర ఉపాధిని అందించే అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.ఎవరెవరికి అవసరం ఉందో గుర్తించి ఎంపిక చేసిన తరువాత ప్రాధాన్యత క్రమంలో అందించడం జరుగుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో షెర్ప్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అమీర్,డాక్టర్ నోవా,డాక్టర్ పరమేశ్వర్,డాక్టర్ ప్రమీల,డాక్టర్ వరలక్ష్మీ, వెంక టయ్య,శేఖరయ్య పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ సుబ్బారాయుడు

## విద్యార్థుల మహా ధర్నాను విజయవంతం చేయాలి

**షాద్‌నగర్, ఆగస్టు 4, ప్రభాతవార్త :** విద్యార్థుల సమస్యల పరిష్కారం, విద్యా హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ విద్య బలోపేతమే లక్ష్యంగా ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ (ధర్నా చౌక్) వద్ద నిర్వహించనున్న ఛలో హైదరాబాద్ఛ విద్యార్థుల మహా ధర్నాను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు.మంగళవారం షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు విజ్ఞాన్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ విద్యను పరిరక్షించేందుకు ఈ మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం చేపడుతున్న ఈ పోరాటంలో ప్రతి విద్యార్థి బాధ్యతగా పాల్గొని విజయవంతం చేయాలని శ్రీకాంత్ కోరారు. షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు పరిసర ప్రాంతాల కళాశాలల విద్యార్థులు కూడా భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ టౌన్ ఉపాధ్యక్షులు అదిల్, చరణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, రాంచరణ్, తరుణ్, రాజేష్, శ్రీనేతన్ తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌ను కలిసి ఎస్ఐఆర్ విషయంలో బిఎల్ఓలు ఓటర్లను పట్టించుకోవటం లేదని చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేసిన మహిళా శక్తి మైవాయిస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్.హైమారెడ్డి,పాల్గొన్న దృశ్యం

## 'ఎస్ఐఆర్' నమోదును బిఎల్ఓలు పట్టించుకోవటంలేదు

**అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు ఫిర్యాదు**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 4, ప్రభాతవార్త:** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన మీ సమస్యా–మా పరిష్కారం కార్యక్రమాల్లో ఎన్యుమరేషన్ ఓటర్ల నమోదు ఎస్ఐఆర్ విషయంలో బిఎల్ఓలు ఓటర్ల సమస్యను పట్టించుకోవటం లేదని, మా సంఘం నిర్వహించగ పలు ఫిర్యాదులు ఓటర్ల నుంచి అందినట్లు, ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు సమీపిస్తున్నందున తగు చర్యలు తీసుకోవాలని ఓటర్లు తమ ఓటును కోల్పోకుండా చూడాలని, బిఎల్ఓలు ఇంటింటా పర్యటించి ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాలను నింపి స్వీకరించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌ను మహిళా శక్తి మైవాయిస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు, బిజెపి రాష్ట్ర నాయకురాలు ఎన్.హైమారెడ్డి కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా మహిళా శక్తి మైవాయిస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు,బిజెపి రాష్ట్ర నాయకురాలు ఎన్.హైమారెడ్డి మాట్లాడుతూ మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఉన్నటువంటి ఓటర్లు తాము నిర్వహించిన మీ సమస్యా–మా పరిష్కారం కార్యక్రమంలో భాగంగా ఎస్ఐఆర్ ప్రక్రియ ముగింపు దశకు వస్తున్నప్పటికీ ఓటర్లకు ఇంకా అనుమానాలు ఉన్నట్లు, బిఎల్ఓలు పట్టించుకోవటం లేదని ప్రజలు మా సంఘం దృష్టికి తెచ్చారని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ దృష్టికి తీసుకవెళ్లినట్లు ఆమె తెలిపారు.

జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌ను కలిసి డివిజన్లలో ఓటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటానికి బిఎల్ఓలను వెంటనే ఓటర్లకు అందుబాటులో ఉంచే విధంగా తగు చర్యలు తీసుకుని ఓటర్లలో ఉన్న అబద్రతా భావాన్ని నివృత్తి చేయాలని మహిళా శక్తి మై వాయిస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్.హైమారెడ్డి కోరారు. ఈ విషయంపై జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సానుకూలంగ స్పందించారని తగు చర్యలు తీసుకుంటామని బిఎల్ఓలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు ఎన్.హైమారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి రమేశ్ అంబటి, బిజెపి నాయకులు అంజనేయులు ముదిరాజ్, శ్రీనివాస్‌ముదిరాజ్, ఆర్తీ, నందిని తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ ప్రవీణ్‌కు వెంటనే భద్రత కల్పించాలి

**పరిగి టౌన్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ ఐపీఎస్ అధికారి ప్రశ్నించే గొంతు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వం భద్రత తొలగిం చిన కారణంగా వారికి తిరిగి భద్రతను ఏర్పాటు చేయాలని పరిగి పట్టణంలో టిఆర్ఎస్ నాయకులు బహర్ పేట్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలియ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తొలి నుండి అట్టడుగు వర్గాలకు బలహీన వర్గాలకు అండగా నిలిచిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపనీయమని వెంటనే వారికి భద్రత ను పునరుద్ధరించాలని తెలియజేశారు.కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ పరిగి మండల పార్టీ అధ్యక్షులు ఆర్ ఆంజనేయులు సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి . విజయ్ ఆర్య . కౌన్సిలర్లు జాక్ రవికుమార్ . మీది గడ్డ శ్రీనివాస్ . తాహెర్ అలీ . ఆనెం ఆంజనేయులు . మంచన్పల్లి ఆనంద్ . సేవియా నాయక్ . వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు యువకులు పాల్గొన్నారు .



నిరసన తెలుపుతున్న నాయకులు



అలియాబాద్ మున్సిపల్‌లోని 8వ వార్డులో మొక్కలను ప్రజలకు పంపిణీ చేసిన చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి,పాల్గొన్న కమిషనర్ వెంకట్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరుల దృశ్యం

## ఉచితంగా మొక్కలను పంపిణీ

**శామీర్‌పేట, ఆగస్టు 4, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని, ప్రతి కుటుంబ సభ్యులు మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించటానికి ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్‌లోని 8వ వార్డులో వనమహోత్సవాన్ని పురస్కరించుకుని ఉచితంగా మొక్కలు పంపిణీ చేసే కార్యక్రమానికి ఆమె శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలన్నారు. మొక్కలను నాటటం వాటిని పెంచటం ద్వారా ఆరోగ్య వాతావరణాన్ని పొందవచ్చని ఆమె సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో ప్రతి పౌరుడు భాగస్వాములు కావాలని, మొక్కలు నాటటమే కాకుండా వాటిని సంరక్షించటం కూడ బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సంబంధిత అధికారులు శ్రీనివాస్, వేణుగోపాల్, విజయ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషిచేస్తా

**మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పిఆర్‌టియు టిఎస్ జిల్లా కార్యదర్శి ఆకుల సత్యం**

**శామీర్‌పేట, ఆగస్టు 4, ప్రభాతవార్త:** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పిఆర్‌టియు టిఎస్ జిల్లా కార్యదర్శిగా ఆకుల సత్యం (శామీర్‌పేట మండలం) రెండవసారి ఎన్నికయ్యారు. పిఆర్‌టియు టిఎస్ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. శామీర్‌పేట మండలం నుంచి మేడ్చల్ జిల్లా పిఆర్‌టియు టిఎస్ జిల్లా కార్యదర్శిగా రెండవసారి ఆకుల సత్యం ఎన్నికైనందుకు తెలంగాణ రాష్ట్ర పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షంగౌడ్, రెండవ సారి మళ్లీ ఎన్నికైన జిల్లా అధ్యక్షులు వై.రామేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రెడ్డిలు కూడ ఆయనను అభినందించారు. అదే విధంగా ఆ తరువాత పాల్గొన్న ఎమ్మెల్సీ పింగలి శ్రీపాల్‌రెడ్డి కూడ జిల్లా కార్యవర్గంకు ఎన్నికైన వారిని అభినందించినట్లు తెలిపారు. అదే విధంగా జిల్లాలోని అన్ని మండలాల కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో పాటు రాష్ట్ర,జిల్లా, మండలాల కార్యవర్గ సభ్యులు కూడ పాల్గొని జిల్లా నూతన కార్యవర్గంను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా పిఆర్‌టియు టిఎస్ కార్యదర్శిగా ఎన్నికైన ఆకుల సత్యం మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి తన వంతుగా అందుబాటులో ఉంటూ కృషి చేస్తానని, తనను జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు ఆకులు సత్యం దన్యవాదాలు తెలియజేశారు.



ఆకుల సత్యం ను అభినందించిన రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్‌రెడ్డి దృశ్యం

## దుద్యాల్ మండలంలో ఘనంగా పోచమ్మ బోనాల వేడుకలు

**దుద్యాల్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** దుద్యాల్ మండల కేంద్రంతో పాటు లగచర్ల తదితర గ్రామాల్లో గ్రామదేవత పోచమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు సాంప్రదాయ వస్త్రధారణలో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, మంగళహారతులు, పల్లకి ఊరేగింపులతో గ్రామాలు ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయాయి. అమ్మవారి కటాక్షంతో గ్రామాల్లో సుఖశాంతులు, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని భక్తులు ప్రార్థించారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మహిళ సంఘం అధ్యక్షురాలిగా వడ్ల విజయలక్ష్మి

**జిల్లేడు చౌదరిగూడ, ఆగస్టు 4,ప్రభాత వార్త :** జిల్లేడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల మహిళా సంఘాల గ్రామ సంఘం అధ్యక్షురాలిగా వడ్ల విజయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం గ్రామంలోని రైతు వేదికలో జరిగిన మహిళా సంఘాల సర్వసభ్య సమావేశం సీసీ రమేష్ ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ సందర్భంగా 43 మహిళా సంఘాల అభిప్రాయం మేరకు అధ్యక్షురాలిగా వడ్ల విజయలక్ష్మిని ఎంపిక చేస్తున్నట్లు సర్పంచ్ సోనీ శేఖర్, ఉప సర్పంచ్ గుడిసె బాలరాజ్‌లు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సంఘాల నిర్వహణలో మహిళా సంఘాలకు అవసరమైన నిధులు ఇప్పించడంలో తోడ్పాటు అందించాలని అంతేస్థాయిలో రికవరీ సైతం చేయించే విధంగా చూడాలని అన్నారు. అనంతరం నూతన అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులందరికీ అందుబాటులో ఉంటూ మహిళా సమైక్య నిబంధనలను పాటిస్తానని నాపై నమ్మకంతో గ్రామ సంఘ అధ్యక్షురాలుగా ఎంపిక చేసిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిసి రమేష్, మహిళా సమైక్య మాజీ అధ్యక్షురాలు మంజుల, జరీనా బేగం, స్వప్న, రేఖ, సువర్ణ, కృష్ణవేణి, రావుల బాలమణి, గుడిసె శంకరమ్మ, గుడిసె శోభ, తోపాటు గ్రామ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## నవజాత శిశువులకు ముర్రుపాలే తొలి టీకా

**-లింగందన సర్పంచ్ నాగిల్ల వెంకట్**



తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న సర్పంచ్ నాగిల్ల వెంకట్ ,సూపర్‌వైజర్ ,అంగన్‌వాడీ టీచర్లు,తదితరులు

**కేశంపేట, ఆగస్టు 4, ప్రభాతవార్త :** పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు, వారి ఆరోగ్యాన్ని కాపాడటానికి తల్లిపాలే శ్రీరామరక్ష అని ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మ, లింగందన సర్పంచ్ నాగిల్ల వెంకట్ స్పష్టం చేశారు.కేశంపేట మండల పరిధిలోని లింగందన, పాపిరెడ్డిగూడ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాపిరెడ్డి కూడా గ్రామంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మ లింగంధన గ్రామంలో సర్పంచ్ నాగిల్ల వెంకట్ పాల్గొని బాలింతలకు, గర్భిణులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ

తొలి పాలు అమృతం లాంటివి అని శిశువు జన్మించిన గంటలోపే అందించే ముర్రుపాలు పిల్లలకు మొదటి టీకా లాగా పనిచేసి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని ఆరు నెలల వరకు తల్లిపాలే ముఖ్యమైనవని మొదటి ఆరు నెలల పాటు శిశువుకు నీళ్లు కూడా ఇవ్వకుండా కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలని తల్లిపాలపై ఉన్న రకరకాల మూఢ నమ్మకాలు, అపోహలను వీడి శాస్త్రీయ దృక్పథంతో పిల్లలకు పాలు అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీశైలం, జిపిఒ కృష్ణయ్య, ఉపసర్పంచ్ లావణ్య తిరుపతిరెడ్డి, సుమతి లక్ష్మి స్థానిక అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఆయా గ్రామాలకు చెందిన చెందిన గర్భిణులు, బాలింతలు మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలు ముఖ్యం

**బంట్వారం,ప్రభాతవార్త :** మండల పరిధిలోని యాచారం గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో గ్రామ సర్పంచి జ్యోతి ఆధ్వర్యంలో అంగ న్వాడి టీచర్ కృష్ణ వేణి తల్లిపాల వారోత్స వాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జ్యోతి పాల్గొని మాట్లా డారు. తల్లిపాలు పిల్లలకు చాలా శ్రేష్టమైనవి అని అన్నారు. అంగనాడీ కేంద్రంలో గర్భిణీలకు, బాలింత లకు, చిన్నపిల్లలకు తగినంత పోషక ఆహారాన్ని అందించి జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత అంగన్వాడీ సిబ్బందికి ఉందని సర్పంచ్ జ్యోతి అన్నారు. ఈ సందర్భంగా బాలింతలకు తల్లిపాలవారోత్స వాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కృష్ణవేణి, మనీలా, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.



తల్లి పాల వారోత్సవంలో మాట్లాడుతున్న సర్పంచ్ జ్యోతి

## డెయిరీ రంగ అభివృద్ధిపై రాష్ట్రస్థాయి అధికారుల సమీక్ష

**కొడంగల్ రూరల్, ఆగస్టు 4 (ప్రభాతవార్త):** కొడంగల్ నియోజకవర్గంలో డెయిరీ రంగం, పాడి పరిశ్రమ అభివృద్ధిపై ఎన్‌డీడీబీ, సెర్ప్, పశు సంవర్ధక, పశువైద్య శాఖ రాష్ట్ర స్థాయి అధికారులు సమీక్షించారు. మంగళవారం కొడంగల్ నియోజకవర్గంలోని నాగిరెడ్డిపల్లి, రేగడిమైలారం, పర్సా పూర్ గ్రామాల్లో అధికారులు సుబ్బరాయుడు, రాజేశ్వర్, అమిత్ పర్యటించారు.

పాల ఉత్పత్తి చేస్తున్న రైతుల క్షేత్రాలు , పశుగ్రాసం సాగు ప్రాంతాలను సందర్శించారు. అనంతరం కొడంగల్‌లో పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ నోహాతో కలిసి రైతులు, మహిళా స్వయం సహాయక సం ఘాల సభ్యులకు డెయిరీ రంగం, పాడి పరిశ్రమ అభివృద్ధిపై చర్చించి అవగాహన కల్పించారు. సమీక్షలో వారి అభిప్రాయాలు, అవసరాలను తెలుసుకున్నారు. గ్రామీణ మహిళలకు స్థిరమైన ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందిస్తుందని తెలిపారు.

డెయిరీ రంగం, పాడి పరిశ్రమ, పశుపోషణ, మత్స్య, కోళ్ల పెంపకం లాంటి రంగాల్లో కొత్త అవకాశాలను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్తుందన్నారు. అనంతరం పశువైద్య శాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు పరమేశ్వర్‌రావు, ప్రమీల, వరలక్ష్మీ, సిబ్బంది వెంకటయ్య, శేఖరయ్య, గోపాలమిత్రలు పాల్గొన్నారు.